నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | ఆదివారం 14 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

క్రీడలతో మానసికోల్లాసం

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- వెంకట్రావుపేటలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

లక్షెట్టిపేట, జనవరి 13 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకట్రావు పేటలోని ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ అంకతి రాజేశ్వరి-శేషన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగైపోతున్న కబడ్డీ క్రీడను ఇక్కడ యేటా నిర్వహిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా ఆడాలని సూచించారు. సుమారు 32 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, ఎంపీటీసీ సత్తయ్య, నాయకులు అంకతి గంగాధర్, వెంకటేశ్, వేణు, గడుసు రమేశ్, కాంద్రపు శంకరయ్య, రామకృష్ణ, సతీష్, మోటపల్కుల శ్రీనివాస్, తోట సాగర్ పాల్గొన్నారు.

కాసిపేట : కేంద్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

కాసిపేట, జనవరి 13 : మండలంలోని మల్కేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాన్ని విద్యుత్ శాఖ ఏఈ శేషరావు, డీఈ రాజన్న ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా మీటర్, సర్వీస్ వైర్‌తో పాటు విద్యుత్‌ను కూడా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ , ఏఈ స్వర్ణలత, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్లకు విద్యుత్ మీటర్ల బిగింపు

హాజీపూర్, జనవరి 13 : మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడెం గిరిజనుల ఇళ్లకు ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద శనివారం విద్యుత్ మీటర్లు బిగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్స్ రాథోడ్ శేషారావు, డీఈ ఆపరేషన్ ఎండీ కైసర్, ఏడీఈ రాజశేఖర్, హాజీపూర్ ఏఈ మహేందర్ రెడ్డితో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్-6 సేఫ్

- ఇప్పటికే మరో రెండు పులి పిల్లల పాదముద్రలు గుర్తింపు
- చనిపోయిందనుకున్న పులి బతికి ఉండడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

పశువును వేటాడుతూ కెమెరాకు చిక్కిన పులి

మంచిర్యాల, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పులి పిల్లల సెర్చ్ ఆపరేషన్ ఓ కొలిక్కి వచ్చింది. విష ప్రయోగంతో ఎస్-9(మగ పులి)తో పాటు మరో పిల్ల పులి ఎస్-15 కూడా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈనెల మొదటివారంలో రెండు రోజుల తేడాతో రెండు పులుల మృతి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ రెండు పులులతోపాటు మరొకటి కూడా విష ప్రయోగం చేసిన పశు మాంసాన్ని తిన్నట్లు తెలియడంతో ఎస్-9 జతగా ఉన్న ఆడపులి ఎస్-6తో పాటు దాని మరో రెండు పులి పిల్లల జాడపై ఉత్కంఠ నెలకొన్నది. దీంతో నాలుగు రోజులుగా అధికారులు కంటి మీద కునుకు లేకుండా అడవిని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో దరిగాం అటవీ ప్రాంతంలో ఎస్-6 పులి ఓ పశువును వేటాడుతూ సీసీ కెమెరాకు చిక్కింది. ఈ నెల 11వ తేదీన రికార్డు అయిన ఈ దృశ్యాన్ని శనివారం అధికారులు విడుదల చేశారు. చనిపోయి ఉంటుందని భావిస్తున్న పులి కెమెరాకు చిక్కడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దాని పిల్లలైన మరో రెండు పులి పిల్లల పాదముద్రలు కూడా తాజాగా దొరకడంతో ఎస్-6తో దాని సంతానమైన మరో రెండు పులులు క్షేమంగా ఉన్నట్లుగా భావిస్తున్నారు. కాకపోతే మిగిలిన పులుల పాద ముద్రలతో పాటు సీసీ కెమెరాల్లో లేదా లైవ్ కెమెరాల్లో ఆ పులులు కనిపించాల్సి ఉంటుంది. కాగా.. ఎస్-6తోపాటు పిల్లల్లో ఒకటైన మరో పులిని ఓ అధికారి అడవిలో చూసినట్లుగా చెప్తున్నారు. ఇక పులుల జాడ కోసం సెర్చ్ ఆపరేషన్ శనివారం కొనసాగింది. దాదాపు 80 మంది అధికారులు 12 నుంచి 13 బృందాలుగా విడిపోయి అడవిని జల్లెడ పట్టారు. మిగిలిన పులుల జాడ తెలిసే వరకు ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



ఎస్-10పై అధికారుల ఆశలు

ఎస్-6(ఆడపులి) జతగా ఉన్న ఎస్-9 మృతి చెందడంతో కాగజ్‌నగర్ రేంజ్‌లో పులుల మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోపాటు స్థానికుల ఆగ్రహం పులి మరణానికి దారి తీయడం అటవీ శాఖ అధికారుల్లో పెద్ద చర్చనీయంగా మారింది. నిబంధనల ప్రకారం పులుల ఆచూకీని బయట ఎవరికీ చెప్పకూడదు. పులి సంచరిస్తున్నదని తెలిస్తే స్థానికంగా ఉంటే వేటగాళ్లకు సమాచారం ఇచ్చినట్లు అవుతుందని జాగ్రత్తలు పాటిస్తారు. కానీ.. వరుసగా రెండు పులుల మరణంతో మీడియా ఫోకస్ మొత్తం అటవీ శాఖపైకి మళ్లింది. పులులు ఏమయ్యాయి? బతికున్నాయా? చనిపోయాయా? అనే సమాచారం రోజూ బయటికి వెళ్తున్నది. దీంతో జాగ్రత్తలు వహిస్తున్నామని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అందుకే ఎస్-6 రికార్డును రెండు రోజులు ఆలస్యంగా విడుదల చేసినట్లు చెప్పారు. ఎస్-9 మృతి చెందినప్పటికీ సిర్పూర్ రేంజ్‌కు ఇటీవల వచ్చిన ఎస్-10 (మగ పులి) కదలికలను గుర్తించినట్లుగా సదరు అధికారి తెలిపారు. ఎస్-6తో జత కట్టడానికి అది సరిగ్గా సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాకపోతే ఆ పులి పాదముద్రలు మాత్రమే ఇప్పటివరకు అధికారులకు దొరికాయి. అది కూడా కెమెరా ట్రాప్‌లో ఎక్కడా దొరకలేదు. సిర్పూర్ మండలం వేంపల్లి, చీలపల్లి అటవీ ప్రాంతాల్లో ప్రస్తుతం అది సంచరిస్తున్నట్లు చెప్తున్నారు. మొత్తంగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ రేంజ్‌లలో 10కి పైగా పులులు నిత్యం సంచరిస్తున్నాయి. తాజాగా.. రెండు పులుల వరుస మరణాలతో మిగిలిన పులుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలోనే మహారాష్ట్ర అటవీ శాఖ అధికారులతో తెలంగాణ అధికారులు సమావేశమై పులుల సంరక్షణ, నిత్యం రాకపోకలు సాగించే పులుల సమాచారం ట్రాక్ చేయడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది.


దరిగాం అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు

యువత క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు

కెరమెరి, జనవరి 13 : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం చిన్న సాకడ(శ్యాంరావుగూడ) గ్రామంలో నిర్వహించిన స్వర్గీయ పెందోర్ జంగు పటేల్ స్మారక కబడ్డీ 24వ క్రీడోత్సవాల్లో పాల్గొని పోటీలు ప్రారంభించారు. అంతకుముందు జంగు పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబుల్ కలాం, సర్పంచులు సుమిత్రాబాయి, కుమ్రం నాణేశ్వర్, నాయకులు కుమ్రం భీంరావ్, రాము నిర్వాహకులు పెందోర్ ఆనంద్‌రావు, పెందోర్ దంబీరావు, పెందోర్ శ్రీనివాస్, సెడ్మాకి తుకారాం, సోము, వినేష్, భరత్, ఆదివాసీ సంఘాల నాయకులు, రాయ్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

దండేపల్లి, జనవరి13: హన్మకొండ జిల్లా హసన్‌పర్తి శివారులోని ఓ విద్యా సంస్థలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న రాథోడ్ దీప్తి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రూప్లానాయక్, ప్రధాన కార్యదర్శి బనవత్ ప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవిశ్వాసంపై హైకోర్టు స్టే

శీలం రమేశ్

జన్నారం, జనవరి 13 : తనపై కొందరు డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే ఇచ్చినట్లు పొనకల్ సహకార సంఘం చైర్మన్ శీలం రమేశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6న తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని కొందరు డైరెక్టర్లు జిల్లా ఇన్‌చార్జి డీసీవోతో పాటు హైదరాబాద్‌లోని కో ఆపరేటీవ్ రాష్ట్ర కమిషనర్‌కు వినతి పత్రం అందించారన్నారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించడంతో స్టే మంజూరు చేసిందని తెలిపారు. మూడేళ్లుగా రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నానని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు.

బజార్‌హత్నూర్ : ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు(ఫైల్)

చెన్నూర్ పట్టణంలో గంగిరెద్దుల విన్యాసాలు (ఫైల్)

పల్లెల్లో పండుగ సందడి

నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ

- సొంతూళ్లకు జనం.. ఇంటింటా బంధుగణం
- పిండివంటల ఘుమఘుమలు
- ఆకట్టుకుంటున్న గంగిరెద్దుల విన్యాసాలు

చెన్నూర్ టౌన్/బజార్‌హత్నూర్, జనవరి 13: పల్లెల్లకు పండుగ కళ వచ్చేసింది. ఊరూవాడా సందడిగా మారింది. ప్రతి ఇంట్లో సంక్రాంతి సందడి కనిపిస్తున్నది. ఏడాదిలో 12 సార్లు 12 రాశుల్లో సూర్యుడి సంక్రమణ జరుగుతుంది. సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే రోజును సంక్రాంతిగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 14వ తేదీ భోగీ, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు పట్నాల నుంచి ప్రజలు పల్లెల బాట పట్టారు.

భోగి పండుగ : సూర్యోదయానికి ముందే వేకువజామున ఇంటి ముందు చలిమంటలు వేసి పిల్లలకు నూనె, గట్టి పిండితో నలుగుపెడతారు. సాయంకాలం చిన్నపిల్లలను ఇంట్లో అందంగా వేసిన ముగ్గులపై పీటపెట్టి దానిపై కూర్చోబెడతారు. చెంబులో రేగు పండ్లు, బియ్యం, చెరుకు ముక్కలు, ఎండు కొబ్బరి ముక్కలు, పోకలు (బియ్యం మమ చేసినవి), చిల్లర డబ్బులు పిల్లల నెత్తిపైనుంచి పోస్తారు. పెద్దలతో దీవెనలిప్పిస్తారు. చక్కిలాలు, పండ్లను వాయినాలుగా ఇస్తారు.

సంక్రాంతి.. : సూర్యుడిని ప్రత్యేకంగా పూజించే పండుగ సంక్రాంతి. రైతుకు కొత్త పంటలు ఇంటికి చేరి ధాన్యలక్ష్మి 'సంక్రాంతి లక్ష్మి'గా దర్శనమిస్తుంది. కొందరు పితృదేవతలకు తర్పణం ఇస్తారు. ప్రత్యక్షదైవమైన సూర్యునికి తెలుపు రంగు ఇష్టం కాబట్టి, సూర్యోదయానికి ముందు పొంగలి (పాయసాన్నం) చేస్తారు. ఆడపిల్లలు తెల్లవారకముందే కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేస్తారు. మగ పిల్లలు పతంగులను ఎగురవేస్తారు. ముగ్గుల మధ్య లో ఆవు పేడను గొబ్బెమ్మలుగా చేసి బంతిపూలతో అ లంకరిస్తారు. రేగుపండ్లు, చిక్కుడు కాయలు, బి య్యం, నూలు వాటి చుట్టూ పోస్తారు. హరిదాసులకు, గంగిరెద్దులవారికి ధాన్యాన్ని, డబ్బులను దానం చేస్తారు. 'అయ్యగారికి దండంపెట్టు.. మంచిజరగాలని దీవించు..' అంటూ తలూపే గంగిరెద్దుల సందడి కనిపిస్తుంది.

కనుల పండువగా కనుమ : మూడో రోజు కనుమ పండుగ. కనుమనాడు ముత్తయిదువలకు పసుపురాసి, బొట్టుపెట్టి ఒక్కొక్కరికి నోము ఇస్తారు. చక్కెర, నువ్వుల పొడి చేతిలో పెట్టి 'తీపి తిని తియ్యగా మాట్లాడు.. నూలు తిని నూరేళ్లు బతుకు' అని దీవిస్తారు. పెద్ద ముత్తయిదువల దీవెనలందుకుంటారు. చలికాలం పూట నువ్వులు, బెల్లం ఉష్ణాన్నందిస్తాయి. వ్యవసాయంలో తమకు చేదోడువాదోడుగా ఉండే పశువులకు పూజ చేస్తారు. వనభోజనాలు కూడా ఈరోజే నిర్వహిస్తారు.

ఆకట్టుకుంటున్న పతంగులు

పండుగ వేళ చిన్నారులు గాలిపటాలను ఎగరవేస్తున్నారు. వెరైటీ వెరైటీ పతంగులు ఆకట్టుకుంటున్నాయి. సాధారణ పతంగులతో పాటు సీతాకోకచిలుక, డ్రాగన్, తేలు, పాము పక్షి రూపంలో ఉన్న వెరైటీ పతంగులను చిన్నారులు ఇష్టపడుతున్నారు.

బినామీ రేషన్ డీలర్లకు చెక్

- షాపుల్లో తనిఖీలు చేయాలంటూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశం
- ఈ నెల 20లోగా సర్వే పూర్తి చేసి నివేదికలందించాలని సూచన
- ఇతరులు నిర్వహిస్తున్నట్లు తేలితే కేసులు

మంచిర్యాల అర్బన్, జనవరి 13 : బినామీ రేషన్ డీలర్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర సర్కారు కసరత్తు మొదలు పెట్టింది. ఈ అంశంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 20వ తేదీలోగా రేషన్ దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, ఈ నెలాఖరులోగా తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 423 దుకాణాల్లో అధికారులు తనిఖీ చేపట్టనున్నారు. దుకాణం బోర్డుపై పేరున్న వ్యక్తే నడిపిస్తున్నాడా.. లేక వేరే వ్యక్తికి అప్పగించారా.. డీలర్ మృతి చెందిన చోట ఆయన కుటుంబ సభ్యులు కాకుండా వేరేవారెవరైనా నడిపిస్తున్నారా.. అన్న అంశాలపై సర్వే చేయనున్నారు.

డీలర్ వివరాలు లేకుండా ఉన్న మంచిర్యాలలోని ఓ రేషన్ దుకాణం

పక్కాగా పరిశీలిస్తేనే బినామీల ఏరివేత సాధ్యం..

కొందరు రేషన్ డీలర్లు ఇతర పనులు చేసుకుంటుండగా, మరికొందరు పట్టణ ప్రాంతాల్లో ఉంటూ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మహిళలకు ఉపాధి మార్గం చూపించాలనే ఉద్దేశంతో జిల్లాలో అనేక మందికి డీలర్ షాపులు మంజూరు చేశారు. ఎవరికి కేటాయించారో వారే దుకాణంలో ఉంటూ నిత్యావసరాలు ప్రజలకు విక్రయించాల్సి ఉండగా, ఎక్కడా మహిళా డీలర్లు షాపుల్లో ఉంటున్న దాఖలాలు లేవు. అనేక గ్రామాల్లో యువతుల పేర్లపై రేషన్ దుకాణాలు తీసుకున్నారు. వారు వివాహాలు చేసుకొని వెళ్లిపోవడంతో ఆయా దుకాణాలను ఇతరులకు అప్పగించారు. అధికారులు నేరుగా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి చూడడమేగా కుండా ప్రతి నెలా రేషన్ ఎవరు పోస్తున్నారు. ఎవరు నడిపిస్తున్నారు.. ఈ-పాస్ యంత్రాల్లో ఎంత మంది వేలిముద్రలు మారాయి.. ఎవరి ఖాతాల్లోకి కమీషన్ డబ్బులు వెళ్తున్నాయి.. అనే అంశాలను పక్కాగా పరిశీలిస్తేనే బినామీలు ఎవరనేది తెలిసే అవకాశముంది.

బినామీల ఖాతాల్లోకే కమీషన్..

చౌకధరల దుకాణాల్లో రేషన్ పోసేందుకు డీలర్లతో పాటు వారి కుటుంబంలో మరో ఇద్దరికి మాత్రమే ఈ - పాస్ మిషన్‌లో తంబ్ వేసే అవకాశం కల్పించారు. ఒకవేళ డీలర్ అందుబాటులో లేకుంటే ఆయన స్థానంలో వేలిముద్ర వేసి రేషన్ పంపిణీ చేసుకునే వెసలుబాటు కల్పించారు. కానీ కొన్నిచోట్ల రేషన్ దుకాణాల బాధ్యతలను ఇన్‌చార్జిలకు అప్పగిస్తే.. వారు బినామీలకు అప్పగించారు. తహశీల్దార్ కార్యాలయాల సిబ్బందికి వేలిముద్రలు మార్చే అధికారం ఉంది. దీంతో ఎవరికి కావాలంటే వారికి వేలిముద్రలు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ. 140 చొప్పున డీలర్ల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇలా కొందరు బినామీ డీలర్లుగా అవతారం ఎత్తడమేగాకుండా వారి బ్యాంకు ఖాతాలను పౌరసరఫరాల శాఖ వద్ద నమోదు చేయించుకున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే కమీషన్ డబ్బులు నేరుగా బినామీల ఖాతాల్లోనే జమవుతున్నాయి. కాగా, అధికారులు తనిఖీలు చేస్తున్నారనే విషయం బయటకు పొక్కడంతో సదరు డీలర్లు జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు పక్కాగా సర్వే చేయాల్సిన అవసరముంది.

ప్రభుత్వానికి నివేదికలందిస్తాం

రేషన్ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశాం. బినామీ డీలర్లు ఉన్నట్లు గుర్తిస్తే అక్కడికక్కడే కేసులు నమోదు చేయాలని సూచించాం. వాస్తవ డీలర్‌ను సైతం తొలగించాలని ఆదేశించాం. ఈ నెల 20వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలి. తహసీల్దార్లు, ఆర్డీవోలు ఇచ్చే తుది నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తాం.

- వాజీద్ ఆలీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మంచిర్యాల

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- సమష్టిగా బొగ్గు లక్ష్యాలను సాధించాలి
- సింగరేణి సీఎండీ బలరాం
- నస్పూర్ కాలనీ డిస్పెన్సరీలో రూ. 33 లక్షలతో డిజిటల్ ఎక్స్‌రే సెంటర్ ప్రారంభం

సీసీసీ నస్పూర్, జనవరి 13 : సింగరేణి కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పేర్కొన్నారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి శ్రీరాంపూర్ ఏరియాలో ఆయన పర్యటించారు. శనివారం సాయంత్రం నస్పూర్ కాలనీలోని సింగరేణి డిస్పెన్సరీలో రూ.33 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన డిజిటల్ ఎక్స్‌రే సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీని ఏరియా జీఎం సంజీవరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్, ఉపాధ్యక్షులు శంకర్‌రావు, కుమారస్వామి, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, మాజీ ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, రక్షణ, ఓబీ, డిస్పాచ్, సంక్షేమం కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోదని చెప్పారు. సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధనకు ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. రూ. 16 కోట్లు వెచ్చించి శ్రీరాంపూర్, నస్పూర్‌కాలనీలకు తాగు నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థ 8 రాష్ట్రాల విద్యుత్ పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేస్తుందన్నారు. తనకు సీఎండీగా బాధ్యతలు అప్పగించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం పర్సనల్ హన్మంతరావు, ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, డీవైపీఎం కాంతారావు, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాపిపేట, జనవరి 13 : మండలంలోని ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి హెచ్ఎం జాడి పోశం, ప్రస్తుత హెచ్ఎం సుధాకర్ నాయక్, పూర్వ ఉపాధ్యాయులు సంపత్, సత్తన్న, ఎస్ఎంసీ చైర్మన్ బాణాల రాజమౌళి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మారావుపేట పాఠశాలలో ఆపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రాణం తీసిన ప్రేమ వివాహం

- నిర్మల్‌లో మామ,అల్లుడిపై దాడి ఘటనలో వీడిన మిస్టరీ
- అమ్మాయి కుటుంబ సభ్యులే కారణం
- బుచ్చన్న, ఆయన కొడుకు నవీన్‌పై కక్ష
- నవీన్ టీ షర్ట్ వేసుకోవడంతో పొరపడి వెంకటేశ్‌పై దాడి

నిర్మల్ అర్బన్, జనవరి 13: జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. పట్టణంలో శనివారం డీఎస్పీ గంగారెడ్డి హత్య కేసు వివరాలు వెల్లడించారు. నిర్మల్ మండలంలోని అనంతపేట్‌కు చెందిన పోలీసు బుచ్చన్న కుమారుడు నవీన్ ఇంటి ఎదురుగా ఉండే సంటి భీమన్న కుమార్తె ప్రవళికను ఆరు నెలల క్రితం ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. అయితే వరుసలు కలువవని, భీమన్న వారి కుటుంబసభ్యులకు వివరించినా వినలేదు. అయితే ఊళ్లో ఉండొద్దని, వేరే చోటకు వెళ్లి బతకమని చెప్పాడు. అయితే ఇందుకు బుచ్చన్న ఒప్పుకోలేదు. నీ కండ్ల ముందే బతుకుతారని రెచ్చగొట్టాడు. ఇటీవల ప్రవళికకు సీమంతం కూడా జరిపించడంతో, మరింత అవమానంగా భావించి బుచ్చన్నను, నవీన్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. తన రెండో కుమారుడు ప్రమోద్‌తో కలిసి భీమన్న పథకం వేసుకున్నాడు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం బుచ్చన్న, కొడుకుతో కలిసి నిర్మల్ వెళ్తున్నారని తెలుసుకున్నారు. బంగల్‌పేట్ వద్దగల జంగల్‌హనుమాన్ దారిలో కాపు కాశారు. వారు రాగానే విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో బుచ్చన్న అక్కడికక్కడే మృతి చెందాడు.తండ్రి కొడుకులిద్దరిని చంపాలని మాత్రమే వీరు అనుకున్నారు. నవీన్ టీషర్టు వేసుకోవడంతో పొరపడి వెంకటేష్‌ను కత్తితో కడుపులో దాడి చేశారు. ప్రస్తుతం వెంకటేశ్ చికిత్స పొందుతున్నాడు. కొండాపూర్ బైపాస్ వద్ద నిందితులు పట్టుకుని విచారించడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిపై ఐపీసీ 302,307 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.